వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ
# మనం
TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి
వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభ మనం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
ఆర్సి ఇంచార్జిలు,సిసి ఇంచార్జిలు మరియు మండల
విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 108 | పేజీలు : 4 | వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | మంగళవారం 08-09-2026

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?



- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు - మిగతా 2 లో

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం



- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ

తెలంగాణ శాసనసభ సమావేశాల - మిగతా 2 లో

# నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

ఆరావళి కమిటీకి సీజేఐ చురకలు

- ఆరావళి కమిటీ పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు పొడిగింపును తిరస్కరించిన ధర్మాసనం
- నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశం
- గడువులోగా పూర్తిచేయకుంటే కమిటీని పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక
- అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని కమిటీకి సూచించిన కోర్టు

ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ పీసీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తుది నివేదిక సమర్పణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు కావాలని కమిటీ కోరడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. - మిగతా 2 లో



## మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య




తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు

## ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు

జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష




- టోక్యో నిర్మలమైన ఆకాశాన్ని చూపిస్తూ ఓ భారతీయుడి వీడియో
- ఢిల్లీ ఆకాశం అలా ఎందుకు ఉండదని సూటి ప్రశ్న
- ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువే అయినా కాలుష్యం తక్కువ
- ప్రయత్నిస్తే ఢిల్లీని కూడా పరిశుభ్రంగా మార్చవచ్చని ఆశాభావం

జపాన్ రాజధాని టోక్యోలో నివసిస్తున్న ఓమ్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. - మిగతా 2 లో

## స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్


- 118 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- ఐటీ, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు
- 23,800 స్థాయిపై నిఫ్టీకి ఒత్తిడి
- మిడ్‌క్యాప్ పతనం, స్వల్పంగా పెరిగిన స్మాల్‌క్యాప్
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. - మిగతా 2 లో

## ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

- ప్రపంచ కుబేరుల సంపద 15.1 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిక
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెట్టుబడులతో భారీగా పెరిగిన ఆస్తులు
- ప్రపంచవ్యాప్తంగా 3,795కి ఎగబాకిన బిలియనీర్ల సంఖ్య
- కుబేరుల సంఖ్యలో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఉత్తర అమెరికా




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. - మిగతా 2 లో

## నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం



- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా - మిగతా 2 లో

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు

## కార్యకర్తలే పార్టీకి బలం వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు



- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com



# ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు.. జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష

మొదటిపేజీ తరువాయి – టోక్యోలోని స్వచ్ఛమైన నీలాకాశాన్ని చూపిస్తూ, మన దేశ రాజధాని ఢిల్లీలో ఆకాశం ఎందుకు ఇలా నిర్మలంగా ఉండదని ఆయన ప్రశ్నించారు. ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ, రెండు నగరాల మధ్య నెలకొన్న భిన్నమైన వాతావరణ పరిస్థితులపై చర్చకు దారితీసింది. భారత్‌లో కాలుష్యానికి అధిక జనాభానే ప్రధాన కారణమని చాలామంది భావిస్తుంటారని, కానీ వాస్తవానికి ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ టోక్యోలో గాలి, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని తన వీడియోలో వివరించారు. "భారతీయ ఆకాశాలతో ఉన్న సమస్య" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్‌ను పంచుకున్నారు. తన విదేశీ స్నేహితుల్లో కొందరు భారతదేశం అనగానే జనసమ్మర్దంతో కూడిన, దుమ్ముధూళితో నిండిన ప్రాంతంగా భావిస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికి హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఈశాన్య రాష్ట్రాల వంటి అందమైన, అత్యంత పరిశుభ్రమైన ప్రాంతాల గురించి తాను వివరిస్తుంటానని ఆయన పేర్కొన్నారు. మన దేశ రాజధానిలో కూడా స్వచ్ఛమైన ఆకాశం, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటే పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని ఓమ్ అభిప్రాయపడ్డారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే ఇది కచ్చితంగా సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

మొదటిపేజీ తరువాయి – వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750–23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

# ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

మొదటిపేజీ తరువాయి – గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్ల' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది. ఇది మొత్తం బిలియనీర్ల ఆస్తిలో దాదాపు 27 శాతానికి సమానం. ప్రాంతాల వారీగా చూస్తే, 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత యూరప్ (1,081), ఆసియా (881) ఉన్నాయి. అయితే, ఈ సంపదలో అధిక భాగం స్టాక్ మార్కెట్ విలువలతో ముడిపడి ఉన్నందున, 'ఏఐ'పై సెంటిమెంట్ మారితే ఇందులో హెచ్చుతగ్గులు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే దశాబ్దంలో సుమారు 6.6 ట్రిలియన్ డాలర్ల సంపద దాదాపు 5,000 మంది వారసులకు బదిలీ అవుతుందని కూడా అల్ట్రాటా అంచనా వేసింది.

# నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

మొదటిపేజీ తరువాయి – పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

# ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?



మొదటిపేజీ తరువాయి – అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

మొదటిపేజీ తరువాయి – ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించి తీరాలని సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీ కోరిన గడువు (2027 ఫిబ్రవరి 28) తన పదవీ విరమణ తేదీ తర్వాత ఉందని సీజేఐ చురక అంటించారు. "కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరినట్లుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదికను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించడంలో విఫలమైతే, కమిటీని పునర్వ్యవస్థీకరించే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సంఘాలతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకోవడానికి అదనపు సమయం అవసరమని కోరారు. అయితే, ఆరు నెలల గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు, కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చింది. నివేదికను ఖరారు చేసే ముందు అన్ని వర్గాలతో సమర్థవంతంగా సంప్రదింపులు జరపాలని కమిటీకి సూచించింది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జూన్‌లో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ఈ కమిటీ వాస్తవానికి ఆగస్టు 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉంది. పర్వత శ్రేణిగా గుర్తించాలంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉండాలన్న నిబంధన వల్ల పర్యావరణపరంగా కీలకమైన ప్రాంతాలు పరిరక్షణ చట్రం నుంచి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక కీలకంగా మారింది. ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

మొదటిపేజీ తరువాయి – చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం

మొదటిపేజీ తరువాయి – అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

### కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

### గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్–రన్–హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

మొదటిపేజీ తరువాయి – చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్–2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

### విజన్–2047తో నియోజకవర్గాల అభివృద్ధి

స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద–ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం



మొదటిపేజీ తరువాయి – వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర



మొదటిపేజీ తరువాయి – ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

### కొడంగల్‌లో 81 వేల ఓట్లు


తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

### సారంపల్లి సేవలు చిరస్మరణీయం

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

# నిర్జలీకరణ సమస్యతో ఇబ్బంది పడుతున్నారా..
# వెంటనే ఈ అలవాట్లకు గుడ్ బై చెప్పండి..






చాలా సార్లు మనం తినే ఆహారం పట్ల శ్రద్ధ చూపము. దీనివల్ల శరీరం నిర్జలీకరణ సమస్య బారిన పడుతుంది. ఈ సమయంలో తలతిరుగడం, బలహీనత వంటి సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. ఇది ఎక్కువగా శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు జరుగుతుంది. కనుక శరీరంలో నిర్జలీకరణ సమస్య రాకుండా ఉండటానికి పొరపాటున కూడా కొన్ని రకాల ఆహార పదార్థాలను తినొద్దు. ఎందకంటే కొన్నిరకాల ఆహార పదార్థాలను ఎందుకు తినొద్దో తెలుసుకుందాం. వేసవి కాలంలో మాత్రమే కాదు ఒకొక్కసారి వివిధ కారణాల వలన శరీరంలో నీటి లోపం ఏర్పడడం సర్వసాధారణం. వేసవిలో చెమట ద్వారా శరీరం నుంచి నీరు బయటకు విసర్జింపబడుతుందని సీనియర్ వైద్యుడు డాక్టర్ కమల్‌జిత్ సింగ్ కైంత్ అన్నారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి తగినంత నీరు అవసరం. అయితే శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు నిర్జలీకరణ ప్రమాదం పెరుగుతుంది. అయితే శరీరంలో నీటి లోపం కలిగించే కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని మీకు తెలుసా? వీటిని వేసవి కాలంలో మాత్రమే కాదు.. ఏ కాలంలోనైనా సరే ఈ ఆహార పదార్థాలను అధిక మొత్తంలో తిన్నా.. తాగినా అనేక ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది. వేసవి కాలంలో మాత్రమే కాదు ఒకొక్కసారి వివిధ కారణాల వలన శరీరంలో నీటి లోపం ఏర్పడడం సర్వసాధారణం. వేసవిలో చెమట ద్వారా శరీరం నుంచి నీరు బయటకు విసర్జింపబడుతుందని సీనియర్ వైద్యుడు డాక్టర్ కమల్‌జిత్ సింగ్ కైంత్ అన్నారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి తగినంత నీరు అవసరం. అయితే శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు నిర్జలీకరణ ప్రమాదం పెరుగుతుంది. అయితే శరీరంలో నీటి లోపం కలిగించే కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని మీకు తెలుసా? వీటిని వేసవి కాలంలో మాత్రమే కాదు.. ఏ కాలంలోనైనా సరే ఈ ఆహార పదార్థాలను అధిక మొత్తంలో తిన్నా.. తాగినా అనేక ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

వేసవిలో కారంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే వాటిలో అదనపు నూనె ఉండటం వల్ల పదే పదే దాహం వేస్తుంది . కాప్సైసిన్ కూడా కారంలో ఉండే పదార్థాలలో ఉంటుంది. ఇది ఆరోగ్యానికి హానికరం. ఇది మీకు డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది. వేసవిలో కారంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే వాటిలో అదనపు నూనె ఉండటం వల్ల పదే పదే దాహం వేస్తుంది . కాప్సైసిన్ కూడా కారంలో ఉండే పదార్థాలలో ఉంటుంది. ఇది ఆరోగ్యానికి హానికరం. ఇది మీకు డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది.

వాస్తవానికి డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అయినప్పటికీ వేసవిలో లేదా ఇతర సమయాల్లో కూడా అధిక మొత్తంలో తీసుకోవద్దు. ఎందుకంటే వీటి స్వభావంచాలా వేడిగా ఉంటుంది, దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది . శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. వాస్తవానికి డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అయినప్పటికీ వేసవిలో లేదా ఇతర సమయాల్లో కూడా అధిక మొత్తంలో తీసుకోవద్దు. ఎందుకంటే వీటి స్వభావంచాలా వేడిగా ఉంటుంది, దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది . శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది.

చాలా మంది కాఫీని ఇష్టపడతారు ఎందుకంటే ఇది అలసట ,బద్ధకాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఈ కాఫీని ఎక్కువగా తాగడం వలన శరీరంలో నిర్జలీకరణం ఏర్పడుతుంది. శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. అజీర్ణ సమస్యకు కూడా కారణమవుతుంది. చాలా మంది కాఫీని ఇష్టపడతారు ఎందుకంటే ఇది అలసట ,బద్ధకాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఈ కాఫీని ఎక్కువగా తాగడం వలన శరీరంలో నిర్జలీకరణం ఏర్పడుతుంది. శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. అజీర్ణ సమస్యకు కూడా కారణమవుతుంది.



కొంత మంది దాహార్తిని తీర్చుకునేందుకు వేసవి కాలంలో అధిక మొత్తంలో శీతల పానీయాలు తీసుకుంటారు ఎందుకంటే ఈ శీతల పానీయాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. అయితే వాటిలో చాలా చక్కెర ఉంటుంది. అందువలన ఈ శీతల పానీయాలను ఎంత తాగినా దాహం కలుగుతూనే ఉంటుంది. అంతేకాదు వీటిని తాగడం వలన శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. కొంత మంది దాహార్తిని తీర్చుకునేందుకు వేసవి కాలంలో అధిక మొత్తంలో శీతల పానీయాలు తీసుకుంటారు ఎందుకంటే ఈ శీతల పానీయాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. అయితే వాటిలో చాలా చక్కెర ఉంటుంది. అందువలన ఈ శీతల పానీయాలను ఎంత తాగినా దాహం కలుగుతూనే ఉంటుంది. అంతేకాదు వీటిని తాగడం వలన శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది.

బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు వేసవిలో తినకూడదు. ఎందుకంటే ఇవి నూనె అధికంగా ఉండే ఆహారాలు. అంతేకాదు వీటిల్లో అధిక ఉప్పు కంటెంట్ కలిగి ఉంటుంది. దీని కారణంగా బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహార పదార్దాలను తినడం వలన నిర్జలీకరణ సమస్యను పెంచుతాయి. బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు వేసవిలో తినకూడదు. ఎందుకంటే ఇవి నూనె అధికంగా ఉండే ఆహారాలు. అంతేకాదు వీటిల్లో అధిక ఉప్పు కంటెంట్ కలిగి ఉంటుంది. దీని కారణంగా బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహార పదార్దాలను తినడం వలన నిర్జలీకరణ సమస్యను పెంచుతాయి.

## ఈ తప్పులు చేస్తున్నారా..? అయితే, మీ ఎముకలు గుల్లయినట్లే.. ఇక ముమ్ముందు కష్టమే..

ఎముకలను జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం.. ఎముకలు బలహీనంగా ఉన్నప్పుడు, అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్న చిన్న అలవాట్లు మీ ఎముకలను బలహీనంగా మారుస్తాయి.. దీంతోపాటు పలు సమస్యలు కూడా వస్తాయి.. అటువంటి పరిస్థితిలో, ఎముకలు బలహీనంగా మారితే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..? మీ ఎముకలను ఎలా బలంగా ఉంచుకోవాలి..? అనే విషయాలను తెలుసుకోండి.. ఎముకలు మన శరీరానికి ముఖ్యమైన ఆధారము.. దృఢంగా ఉండే ఎముకలు శరీరానికి నిర్మాణం, మద్దతు, చలనశీలతను అందిస్తాయి.. శరీరంలోని ఇతర అవయవాలను రక్షిస్తాయి.. అందుకే మన ఆరోగ్యానికి నిజమైన ఆధారం మన ఎముకలే. బలమైన ఎముకలు మనల్ని ఎక్కువ కాలం చురుగ్గా ఆరోగ్యంగా ఉంచుతాయి.. కానీ నేటి బిజీ జీవితం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తప్పుడు అలవాట్ల కారణంగా, ఎముకలు మరింత బలహీనంగా మారుతున్నాయి. అది పెరిగే వరకు మనం సమస్యను విస్మరిస్తాము. అటువంటి పరిస్థితిలో, ఎముక బలహీనతను గుర్తించడం %-% తప్పులను నివారించడం చాలా ముఖ్యం.. ఎముకలు బలహీనపడటానికి గల కారణాలు ఏమిటి..? దాని లక్షణాలు ఏమిటి..? నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకుందాం. ఎముకలు బలహీనపడటానికి అనేక కారణాలు ఉండవచ్చుంటున్నారు ఆరోగ్య నిపుణులు..

### ఎముకలు బలహీనంగా మారడానికి కారణాలేమిటి?

సర్వోదయ ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ ఆంచల్ ఉప్పల్ మాట్లాడుతూ.. చాలా మందికి ఆరోగ్యం.. ఇతర అంశాల గురించి తెలుసు.. కానీ ఎముకల గురించి అంతగా పట్టించుకోరు.. చిన్న చిన్న తప్పుల వల్ల ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. ఎముకలు, కీళ్లలో నిరంతరం నొప్పి ఉంటే, అది అనేక సమస్యలకు సంకేతం కావచ్చు. కాల్షియం విటమిన్ డి లోపం ఎముకలను బలోపేతం చేయడానికి ముఖ్యమైన పోషకాలు కాల్షియం, విటమిన్ డి. మీ ఆహారంలో పాలు, పెరుగు, జున్ను, ఆకుపచ్చ కూరగాయలు, బాదం వంటి ఆహారాలు లేకపోతే, మీ ఎముకలు క్రమంగా బలహీనపడటం ప్రారంభిస్తాయి. సూర్యరశ్మి లేకపోవడం వల్ల విటమిన్ డి లోపం సంభవిస్తుంది. దీని కారణంగా శరీరం కాల్షియంను సరిగ్గా గ్రహించలేకపోతుంది. జంక్ ఫుడ్ కూల్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం ఈ రోజుల్లో పిల్లలు, పెద్దలలో జంక్ ఫుడ్ పట్ల క్రేజ్ బాగా పెరిగింది. శీతల పానీయాలలో ఫాస్ఫారిక్ ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం లోపానికి కారణమవుతుంది. దీనితో పాటు, అధిక ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారం కూడా ఎముకలకు శత్రువులుగా మారుతాయి. శారీరక శ్రమ లేకపోవడం ఢిల్లీలోని ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ పులీన్ కుమార్ వివరిస్తూ.. రోజంతా కూర్చునే లేదా చాలా తక్కువగా కదిలే వ్యక్తుల ఎముకలు ప్రభావితమవుతాయి. వ్యాయామం చేయడం లేదా నడవడం ద్వారా ఎముకలు బలంగా మారుతాయి. ముఖ్యంగా వెయిట్ లిఫ్టింగ్ వ్యాయామాలు ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. సోమరి జీవితాన్ని గడిపే వ్యక్తులకు ఆస్టియోపోరోసిస్ (ఎముకలు బలహీనపడటం) ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ధూమపానం మద్యపాన వ్యసనం ధూమపానం మద్యం సేవించడం ఊపిరితిత్తులు, కాలేయానికి మాత్రమే కాకుండా, ఎముకలకు కూడా ప్రమాదకరం. ధూమపానం ఎముక కణాలను బలహీనపరుస్తుంది. ఎముక సాంద్రతను తగ్గిస్తుంది. మరోవైపు,



మద్యం శరీరంలోని పోషకాల శోషణను ప్రభావితం చేస్తుంది. వయస్సు హార్మోన్లలో మార్పులు స్త్రీలలో రుతువిరతి తర్వాత ఎముక బలహీనత ఒక సాధారణ సమస్య. వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో హార్మోన్ల మార్పులు సంభవిస్తాయి. దీని వలన ఎముకల సాంద్రత తగ్గుతుంది. పురుషులలో కూడా, వయస్సు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడటం ప్రారంభమవుతుంది. ఎముకలు బలహీనపడటం లక్షణాలు ఏమిటి? ఎటువంటి కారణం లేకుండా కీళ్లలో నొప్పి, వీపు లేదా నడుములో నిరంతరం నొప్పి, ఎత్తు క్రమంగా తగ్గడం, చిన్న గాయాలలో కూడా ఎముకలు విరగడం, త్వరగా అలసిపోయినట్లు అనిపించడం, శరీరం వంగిపోయినట్లు అనిపించడం వంటివి ఉంటాయని డాక్టర్ ఆంచల్ ఉప్పల్ తెలిపారు.. ఎముకలను బలోపేతం చేయడానికి మార్గాలు ప్రతిరోజూ కనీసం 15-20 నిమిషాలు ఎండలో కూర్చోండి. కాల్షియం విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినండి రోజులో కొద్దిసేపు నడవండి లేదా తేలికపాటి వ్యాయామం చేయండి. ధూమపానం మద్యం నుండి దూరంగా ఉండండి మీ వైద్యుడు సూచించిన విధంగా ఎముక సాంద్రత పరీక్షలను క్రమానుగతంగా చేయించుకోండి.

## నల్లగా ఉన్నాయని తీసిపారేయకండి..
## సర్వరోగ నివారిణి.. లాభాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు..



ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పిప్పళ్లను సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు.. ఆయుర్వేదంలో పిప్పళ్లను అనేక రోగాలకు దివ్యౌషధంగా ఉపయోగిస్తుంటారు. అస్తమా, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై పిప్పలి అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం, శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వంటగదిలో మన ఆరోగ్యానికి సంబంధించిన అనేక ఔషధ సుగంధ ద్రవ్యాలు దాగి ఉన్నాయి.. అలాంటి ఒక ఔషధ నిధి పిప్పలి (పిప్పళు _)..  ఇది ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారించడంలో ప్రయోజనకరంగా ఉండే అద్భుతమైన ఆయుర్వేద ఔషధం అని నిపుణులు చెబుతున్నారు. పిప్పలి.. దీన్ని మనం తెలుగులో పిప్పళ్లు అని కూడా పిలుస్తాం.. ఇంకా పిప్పళ్లని ఆంగ్లంలో లాంగ్ పెప్పర్ అంటారు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పిప్పళ్లను సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు.. ఆయుర్వేదంలో పిప్పళ్లను అనేక రోగాలకు దివ్యౌషధంగా ఉపయోగిస్తుంటారు. అస్తమా, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై పిప్పలి అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం, శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. దీనికి శోథ నిరోధక లక్షణాలు ఉన్నందున, ఇది నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.. కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. పిప్పళ్లను చరక సంహితలో ఒక ముఖ్యమైన ఔషధంగా వర్ణించారు.. దీనిని అనేక వ్యాధులలో ఉపయోగిస్తారు.

### పిప్పలి ప్రయోజనాలు

పిప్పళ్లు దగ్గు, శ్వాసకోశ వ్యాధులు, జీర్ణ సంబంధిత సమస్యలకు ముఖ్యంగా ప్రయోజనకరంగా ఉంటాయి.. సుశ్రుత సంహితలో, దీనిని దహన్ ఉపకర్ణ అని పిలుస్తారు.. అంటే చర్మ సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడే ఔషధం. వాస్తవానికి, ఇది రక్తాన్ని శుభ్రపరుస్తుంది.. మొటిమలు, మొటిమలు, దురద వంటి సమస్యలను తొలగిస్తుంది.

### సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు

ఆయుర్వేదం ప్రకారం.. పిప్పళ్లు.. పైపెరేసి కుటుంబానికి చెందిన పుష్పించే తీగ, దీని పండ్ల కోసం పెంచుతారు. దీనిని సాధారణంగా ఎండబెట్టి సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు. పొడవాటి మిరియాలు దాని దగ్గరి బంధువు పైపర్ నిగ్రమ్ కంటే రుచిగా ఉంటాయి.. కానీ తియ్యగా.. తక్కువ ఘాటుగా ఉంటాయి.. ఇది మనకు నలుపు, ఆకుపచ్చ, తెలుపు మిరియాలను ఇస్తుంది. ఇది జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది.. దాని శోథ నిరోధక లక్షణాల కారణంగా మంటను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

### గర్భిణీ స్త్రీలు దీనిని నివారించాలి..

దీనిని రోగనిరోధక శక్తిని పెంచేది అని కూడా అంటారు. ఇది జీర్ణవ్యవస్థ, శ్వాసకోశ వ్యవస్థను నియంత్రణలో ఉంచుతుంది. దీని స్వభావం వేడిగా ఉంటుంది.. అందుకే గర్భిణీ స్త్రీలు దీనిని నివారించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.. ఆయుర్వేదం ప్రకారం, పిప్పలి ఉబ్బసం, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది.

### ఎలా తినాలి?

పిప్పలి జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటుంది.. మూత్ర వ్యాధులను కూడా నయం చేస్తుంది. సాధారణంగా, దీనిని చాలా వంటకాల్లో ఉపయోగిస్తారు. 1/4 నుంచి 1/2 టీస్పూన్ తేనె లేదా వేడి నీటితో తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.. అయితే.. దగ్గు జలుబు సమయంలో మింగడంలో ఇబ్బంది ఉంటే, నీటిలో వేసి మరిగించి త్రాగడం కూడా ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతారు. ఇది కూడా సాధ్యం కాకపోతే, వైద్యుడి సలహా మేరకు, మీరు దానిని క్యాప్సూల్ టాబ్లెట్ రూపంలో ఉపయోగించవచ్చు.

## మీరు సూపరండి బాబూ.. 40 ఏళ్ల డాక్టర్.. 20 ఏళ్ల కుర్రాడిలా మారిపోయారు.. ఎలానో తెలుసా..




40 ఏళ్ల డాక్టర్.. 20 ఏళ్ల కుర్రాడిలా మారిపోయారు. లండన్ చెందిన ఆ డాక్టర్ మూడు కీలక సప్లిమెంట్ల సీక్రెట్‌ను రివీల్ చేసి హాట్‌టాపిక్ అయ్యారు. ఇంతకీ.. ఎవరా డాక్టర్?... కుర్రాడిలా మారిపోయేలా చేసిన ఆ మూడు కీలక సప్లిమెంట్లు ఏంటి?... డాక్టర్ ఏం చెప్పారు.. ఈ వివరాలను ఈ కథనంలో తెలుసుకోండి.. సాధారణంగా 41 ఏళ్లు వచ్చేసరికి చాలామంది మధ్య వయస్సుతో అలసటకు గురవుతుంటారు. కానీ.. ఇదిగో ఈ ఫొటోలోని మహమ్మద్ ఇనాయత్ అనే లండన్‌కు చెందిన ఓ ప్రైమరీ కేర్ డాక్టర్ మాత్రం అలాంటి అంచనాలను తారుమారు చేశారు. ప్రత్యేకమైన ఆహారం తీసుకుంటూ తన వయస్సును 24 ఏళ్లుగా మార్చుకుని ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. అతని ఒరిజినల్ ఏజ్ 41 ఏళ్లు కాగా.. దానిని 17 ఏళ్లు తగ్గించుకుని యంగ్ డైనమిక్‌గా ప్రచారంలోకి వచ్చారు. అయితే.. ఈ మార్పులకు కారణం మాత్రం తాను తీసుకునే ఆహారమేనంటూ ఫుడ్ సీక్రెట్‌ను రివీల్ చేశారు డాక్టర్ ఇనాయత్. కేవలం ఫుడ్‌తోపాటు.. రోజువారీ ఆరోగ్య పర్యవేక్షణ, వ్యక్తిగత జీవనశైలిలోనే మార్పులు చేసుకున్నట్లు తెలిపారు. డాక్టర్ ఇనాయత్ తన శరీరాన్ని ఏడేళ్లుగా ఒక డేటా ల్యాబ్‌గా మార్చుకున్నారు. ప్రత్యేక ఆహారం తీసుకోవడంతోపాటు.. నిద్రపోవడం, మేల్కోవడం లాంటి రోజువారీ కార్యకలాపాల కోసం ప్రత్యేక ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించారు. తరచూ వివిధ రకాల టెస్టులు చేయించుకుంటూ లైఫ్‌ను ట్రాక్ చేసుకుంటూ వచ్చారు. ప్రధానంగా.. ఫోలేట్‌తో కూడిన బీకాంప్లెక్స్, మెగ్నీషియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లను రోజువారీగా వాడినట్లు మహమ్మద్ ఇనాయత్ తెలిపారు. ఆయా సప్లిమెంట్లు ఎందుకు వాడాల్సి వచ్చిందో కూడా వివరించారు. తనకు మిథైలేషన్ జన్యులోపం కారణంగా ఫోలేట్‌తో కూడిన బీకాంప్లెక్స్ వాడినట్లు చెప్పారు. వీటి వినియోగంతో మానసిక స్థితి మెరుగుపడి.. మెదడు ఆరోగ్యం పనిచేస్తుందన్నారు డాక్టర్ ఇనాయత్. అలాగే.. కండరాల నొప్పి.. నిద్రలేమికి విరుగుడుగా మెగ్నీషియం తీసుకున్నట్లు తెలిపారు. ఇక.. గుండెను ఆరోగ్యంగా ఉంచుకునేందుకు గాను ఒమేగా-3ని వినియోగించినట్లు తెలిపారు. మొత్తంగా.. ప్రత్యేక సప్లిమెంట్ల ద్వారా 17ఏళ్ల ఏజ్‌ను తగ్గించుకున్న లండన్ డాక్టర్ ఇనాయత్ నేచర్ ఏజింగ్ అధ్యయనం ఆసక్తి రేపుతోంది. ఇనాయత్ లండన్‌లోని లాంగ్వేజ్ క్లినిక్ వ్యవస్థాపకుడుగా.. అలాగే.. ప్రాథమిక సంరక్షణ వైద్యుడిగా.. సేవలందిస్తున్నారు.

## చేప గుడ్లు తింటున్నారా..?
## అయితే, మీ శరీరంలో జరిగేది ఇదే..!



నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్‌తో పాటు చేపలు కూడా ఎక్కువగా తింటూ ఉంటారు. అలాగే, చేపలతో పాటు వాటి గుడ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. కానీ, చేప గుడ్లను తరచూ తినటం వల్ల శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఎప్పుడైనా ఆలోచించారా..? పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ చేప గుడ్లలో ప్రధానంగా మెగ్నీషియం, ఫాస్ఫరస్, విటమిన్ డి, కాల్షియం ఉంటాయి. చేప గుడ్లు తినే అలవాటు కూడా చాలామందిలో ఉంటుంది. ఈ గుడ్లలో పోషకాలు ఉంటాయి. పొటాషియం కలిగి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. అయితే లోబీపీతో బాధపడేవారు తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే, గుండె ఆరోగ్యానికి కూడా చేప గుడ్లు ఎంతో ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. తరచూ చేప గుడ్లు తినటం వల్ల గుండె ప్రమాదాలు దరి చేరకుండా తప్పిస్తాయి. ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ మెదడు పనితీరును మెరుగు చేస్తుంది. అంతేకాదు చేప గుడ్ల వల్ల కంటి ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. చేప గుడ్లలోశరీరానికి అవసరమైన న్యూట్రిషన్లు, బి 12, డి, ఎ తదితర విటమిన్లు, మినరల్స్, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. మతిమరపు సమస్య ఉన్నవారు, అల్జీమర్స్ పేషెంట్లు కూడా క్రమం తప్పకుండా చేప గుడ్లను తినటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. చేప గుడ్లలో లభించే విటమిన్ ఏ కంటి చూపు మెరుగుపరచడంలో సాయపడుతుంది. చేపలు, వాటి గుడ్లు తినటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి రక్తం శుద్ధి చేస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి చేపగుడ్లు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. రెగ్యులర్‌గా చేప గుడ్లు తింటే బీపీ సమస్య తగ్గుతుంది. చేప గుడ్లలో ఉండే విటమిన్ డి తో ఎముకలు, దంతాలను దృఢంగా మారతాయి. చేప గుడ్లు చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. వీటితో చర్మానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంది. శరీరానికి అవసరమైన పాళ్లలో అయోడిన్ ఉంటుంది. హార్మోన్ బ్యాలెన్స్‌కి, జీర్ణక్రియకు ఇది ఉపయోగపడుతుంది. కండరాల ఎదుగుదలకు చేపగుడ్లు ఉపయోగపడతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది ఈ కూరగాయ బెస్ట్ ఇమ్యూనిటీ బూస్టర్.. తరచూ తింటే ఇలాంటి సమస్యలన్నీ తరచూ కలలో పాములు కనిపిస్తున్నాయా..? ఏం జరుగుతుందో తెలిస్తే.. తమషా కాదు..! సర్వ రోగాలకు దివ్యౌషధం ఈ ఆకు.. ప్రయోజనాలు తెలిస్తే.. మరో హనీమూన్ జంట మిస్సింగ్..13 రోజులైనా దొరకని ఆచూకీ.ఏం జరిగిందంటే ఆరోగ్య నిపుణులు, ఇతర అధ్యాయనాల ద్వారా అందిన సమాచారం మేరకు ఈ వివరాలు అందిస్తున్నాం.. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా సందేహాలు,సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించడమే మంచిదని గమనించగలరు.

## ఈ వస్తువులు అప్పుగా అయినా సరే.. ఉచితంగా అయినా సరే అస్సలు తీసుకోకూడదు..! ఎందుకో తెలుసా..?



వాస్తు శాస్త్రం ప్రకారం.. కొన్ని వస్తువులను ఉచితంగా లేదా అప్పుగా తీసుకుంటే ఇంట్లో నెగెటివ్ శక్తి నిండిపోతుంది. ఇది మనకు తెలియకుండానే డబ్బు సమస్యలు, అనారోగ్యం, కుటుంబ కలహాలు వంటివి తెస్తుందని నమ్మకం. ఈ ఆచారాలు చాలా కాలం నుంచి ఉన్నా వాటి వెనుక ఉన్న అర్థం తెలుసుకోవడం చాలా ముఖ్యం. శాస్త్రం ప్రకారం ఉప్పు శని గ్రహానికి గుర్తు. దాన్ని ఇతరుల నుంచి ఉచితంగా తీసుకుంటే శని దోషం వస్తుందని నమ్ముతారు. ఇది ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు తెచ్చే అవకాశం ఉంది. అందుకే ఉప్పును ఎప్పుడూ ఉచితంగా తీసుకోకుండా కొనుగోలు చేయాలి. ఇతరులకూ ఉచితంగా ఇవ్వకుండా జాగ్రత్త పడాలి. కొంతమంది బంధువులు, స్నేహితులు డబ్బుల పర్సును బహుమతిగా ఇస్తారు. కానీ వాస్తు నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇతరులు ఇచ్చిన పర్సును వాడటం వల్ల డబ్బు విషయంలో ఇబ్బందులు రావచ్చు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు కాకుండా ఇతరులు ఇచ్చిన పర్సులను వాడటం వల్ల ఆదాయంలో స్థిరత్వం ఉండకపోవచ్చు. ఇతరులు ఉపయోగించిన హ్యాండ్ కర్చీఫ్ లు తిరిగి తీసుకోవడం మంచిది కాదు. వాస్తు నియమాల ప్రకారం ఇవి మన ఇంటికి, మనశ్శాంతికి చెడు చేస్తాయి. ఇలా చేయడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య గొడవలు, అపార్థాలు ఏర్పడే అవకాశం ఉంది. ఎవరైనా వాడిన గడియారాన్ని తీసుకుని వాడటం వల్ల వారి కాలచక్రం కూడా మనపై ప్రభావం చూపుతుందని నమ్మకం. ముఖ్యంగా ఆ గడియారం వాడినవారు గతంలో ఇబ్బందుల్లో ఉంటే.. వాటి చెడు ప్రభావం మనకూ వస్తుందని వాస్తు చెబుతోంది. అందుకే ఉపయోగించిన గడియారాలను తీసుకోవడం మానుకోవాలి. ఇంట్లో వాడే అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి వాటిని ఇతరుల నుంచి ఉచితంగా తీసుకోవడం వల్ల కుటుంబంలోని శాంతి దెబ్బతినే అవకాశం ఉంది. వాస్తు ప్రకారం దీని వల్ల మన ఇంట్లో గొడవలు, వాదనలు, భావోద్వేగ సమస్యలు పెరుగుతాయని చెబుతారు. ఇది రాహు గ్రహ దోషాన్ని కూడా ప్రభావితం చేస్తుందని నమ్మకం ఉంది.

# ఎండిపోతున్న పంటలు

రైతులకు పురుగుల మందే దిక్కా..?

కూటమి పాలనలో నిలువునా

ఎండిన పైర్లు..

చేతులెత్తేసిన పాలకులు

నాడు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

చొరవతో సమృద్ధిగా సాగునీరు..

నేడు అన్నదాతల కంటి నిండా

కన్నీరు

వైఎస్సార్‌సీపీ నేత బోయ వాల్మీకి

లక్ష్మన్న కంబలదిన్నె కాశీం మేకు

డోనా జావీద్ తీవ్ర ఆగ్రహం.



**పెద్దకడబూరు,సెప్టెంబర్,07,ప్రభ మనం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారిందని, సకాలంలో సాగునీరందక పంటలు కళ్లముందే ఎండిపోతుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు కంబాలదిన్నె మేకడోనా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ వాల్మీకి లక్ష్మన్న బోయ వాల్మీకి ఖాసిం మైనారిటీ జావీద్ ధ్వజమెత్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలకుల రైతు వ్యతిరేక విధానాలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**నాడు నీటి కళ..**

**నేడు ఎడారి స్థితి:** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రాలయం శాసనసభ్యులు శ్రీ వై. బాలనాగిరెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకూ సాగునీరు సక్రమంగా అందించిన ఘనత దక్కించుకున్నారు. నాడు రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా జీవించారు

**మాటల్లేవు.. చేతల్లేవు:**

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఈ సమయంలో సాగునీటి వ్యవస్థ పూర్తిగా కుదేలైంది. పంటలు నిలువునా ఎండిపోతున్నా కూటమి నాయకులు ఇప్పటివరకు సాగునీటిపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.

**పురుగుల మందే శరణ్యమా..?**

పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతుంటే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఇక పురుగుల మందే దిక్కయ్యేలా కూటమి ప్రభుత్వం నెట్టివేసింది.

**తక్షణ డిమాండ్లు:**

ఎండిపోయిన పంట పొలాలను అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలి.నష్టపోయిన రైతులందరికీ ఖరీఫ్ ఇన్సూరెన్స్ పరిహారంతో పాటు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. రైతుల సమస్యలను గాలికొదిలేస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు....

# సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం




**10:42 తెరవని సచివాలయం**
**సిబ్బంది విధులకు రాకపోతే**
**పర్యవేక్షించేది ఎవరు..?**
**అధికారుల బాధ్యత ఏంటి..?**

**తుగ్గలి, సెప్టెంబర్ 7 ( ప్రభ మనం న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలిలోని గ్రామ సచివాలయం ఉదయం 10:41 గంటలు కావస్తున్నా తెరుచుకోకపోవడం అధికారుల పర్యవేక్షణ తీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన సచివాలయం నిర్ణీత సమయానికి తెరుచుకోకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు కార్యాలయం బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా? కార్యాలయం నిర్ణీత సమయానికి తెరుచుకుంటుందా? అనే విషయాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులదే. అయితే ఇంత సమయం అయినా కార్యాలయం తెరుచుకోకపోవడం చూస్తుంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎంతవరకు పనిచేస్తుందో స్పష్టమవుతోంది అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తే.. ప్రజా సేవలపై అధికారులు చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన ఎక్కడ? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా మౌనం వహిస్తే.. బాధ్యత ఎవరిది? జవాబుదారీ ఎవరు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయం సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారిస్తారా? లేక ఇదే నిర్లక్ష్యం కొనసాగుతుందా? వేచి చూడాల్సిందే.

# భక్తి శ్రద్ధలతో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం

మంత్రాలయం సొసైటీ చైర్మన్





**కౌతాళం, సెప్టెంబర్,07,ప్రభ మనం:** ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా స్వామివారు కందుకూరు నది వద్దకు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనమిచ్చారు.ఈ పవిత్రరోజును పురస్కరించుకుని మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గారి సోదరులు, మంత్రాలయం సొసైటీ చైర్మన్ శ్రీ ఎన్.రామకృష్ణ రెడ్డి గారు కందుకూరుకు చేరుకుని ఈరన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఈరన్న స్వామివారి పల్లకిని భక్తిశ్రద్ధలతో మోస్తూ పల్లికోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఈరన్న స్వామివారి కృపాకటాక్షాలు మంత్రాలయం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశేష జనవాహిని మధ్య శ్రీ,ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం....!!

స్వామి వారు విశిష్ట పూజలు

అందుకుంటున్న దృశ్యం..

పూజల్లో పాల్గొన్న ఆలయ ఇఓ.వాణి

**కౌతాళం, సెప్టెంబర్,07,ప్రభ మనం:** ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం మరియు దానితో ముడిపడి ఉన్న కందుకూరు గ్రామం గురించిన భక్తి సమాచారం ఇక్కడ ఉంది,

**క్షేత్ర ప్రాశస్త్యం ఌ విశేషాలు**

నిప్పులాంటి దేవుడు: భక్తులు ఉరుకుంద ఈరన్న స్వామిని అత్యంత భక్తి శ్రద్ధలతో “నిప్పులాంటి దేవుడు” అని, కొలిచిన వారికి కొంగుబంగారమని నమ్ముతారు.

**మహిమాన్విత రావిచెట్టు:** ఇక్కడి గర్భాలయంలో పైకప్పు ఉండదు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, యోగి ఈరన్న స్వామి విగ్రహాలు ఒక పవిత్రమైన రావిచెట్టు (అశ్వత్థ వృక్షం) కింద కొలువై పూజలందుకుంటున్నాయి.

**శ్రావణ మాస ఉత్సవాలు:** ప్రతి ఏటా శ్రావణ మాసంలో, ముఖ్యంగా మూడో సోమవారం రోజున ఇక్కడ జరిగే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్రల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు.

**కందుకూరు – పల్లకోత్సవం పాదయాత్ర ప్రాధాన్యత**

ఉరుకుంద ఈరన్న స్వామి ఆరాధనలో కందుకూరు గ్రామానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది.

**పాదయాత్ర మార్గం:** ఉరుకుంద క్షేత్రానికి జరిగే సాంప్రదాయ పల్లకోత్సవ పాదయాత్ర కందుకూరు గ్రామం మీదుగానే సాగుతుంది.

**గ్రామస్థుల భక్తి శ్రద్ధలు:** పల్లకోత్సవ యాత్ర కందుకూరు గ్రామ సమీపంలోకి చేరుకున్నప్పుడు స్థానిక ప్రజలు, భక్తులు స్వామివారికి మంగళహారతులతో, భజనలు మరియు ప్రత్యేక పూజలతో ఎంతో భక్తి శ్రద్ధలతో ఘన స్వాగతం పలుకుతారు.

**చారిత్రక బంధం:** ఈరన్న స్వామి తన జీవితకాలంలో చుట్టుపక్కల గ్రామాలలో ధర్మ ప్రబోధం చేస్తూ సంచరించినప్పుడు, ఆయా గ్రామాల ప్రజలతో ఏర్పడిన ఆధ్యాత్మిక బంధానికి ప్రతీకగా నేటికీ ఈ పల్లకీ సేవలు కొనసాగుతున్నాయి. ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, రోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. అంతేకాకుండా శ్రావణ మాసం 4,వ సోమవారంలో ప్రతి ఏటా జరిగే శ్రీ,ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం భక్తులు,మరియు అశేష జనవాహిని మధ్య స్వామి వారి పల్లకోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిధిగా, ఆలయ చైర్మన్ పాండు రంగాశెట్టి, ఆలయ డిప్యూటీ డైరెక్టర్ కె,వాణి పూజల్లో పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి పల్లకోత్సవంను విజయవంతం చేశారు.








# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

నూతన పెన్షన్ దరఖాస్తులను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి




**తుగ్గలి, సెప్టెంబర్ 7 ( ప్రభ మనం న్యూస్):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడవలి తిమ్మప్ప అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పెన్షన్ల మంజూరుకు దరఖాస్తులు విడుదల చేయడం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమాన్ని పొందాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. పేదల ఆర్థిక భరోసాకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని తిమ్మప్ప కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వ సహకారంతో పత్తికొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు.

# హామీల మాటలు చాలూ.. అమలు ఎప్పుడు?

కరువు కష్టాల్లో ప్రజలు..

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ డిమాండ్



**తుగ్గలి, సెప్టెంబర్ 7 ( ప్రభ మనం న్యూస్):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఇకనైనా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ డిమాండ్ చేశారు. సోమవారం చిన్న జొన్నగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకనాథ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీలకు 50 ఏళ్లు దాటిన వారికి సామాజిక పింఛన్లు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. 19 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను కూడా నెరవేర్చాలని అన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు గత రెండు సంవత్సరాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు లేక గ్రామాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారుతోందన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు అందించడంతో పాటు రైతులకు అవసరమైన కరువు సహాయక చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని శ్రీదేవమ్మ కోరారు. సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తే ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# తుగ్గలిలో బీజేపీ మండల నాయకుల కీలక సమావేశం

బిజెపి మండల అధ్యక్షుడు టైలర్ లక్ష్మణ




**తుగ్గలి, సెప్టెంబర్ 7 ( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండల కేంద్రంలోని శ్రీరామ దేవాలయంలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సహ ఇంచార్జి బ్రహ్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు రంగయ్య, ఓబీసీ మండల అధ్యక్షుడు ఓలయ్య, బీజేవైఎం మండల, జిల్లా కార్యవర్గ సభ్యులు వై. నాగరాజు, చిన్న కృష్ణ, రాతన ఉల్ తిన్న, కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. సమావేశం అనంతరం భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

# ఐ న్యూస్ రిపోర్టర్స్ పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

జర్నలిస్టులను బెదిరింపు, భయబ్రాంతులకు గురిచేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

**కర్నూలు, సెప్టెంబర్ 07,ప్రభ మనం:** మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుమారులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు ఇస్తే.. న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టడం బాధాకరమని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (×జీఖ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వీ సుబ్బయ్య, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణారెడ్డి, భాష్యం మధు సుధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ నాగేశ్వర రావు, బీ మల్లికార్జున అన్నారు. తమపై వార్తలు ప్రచురించారని ఐ న్యూస్ రిపోర్టర్స్ సురేష్ కుమార్, నాగచంద్రుడు పై నంద్యాల టూ టౌన్ పోలీసులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్స్ పై మంత్రి కుమారులు, రౌడీ షీటర్లు బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. అంతటితో ఆగకుండా రిపోర్టర్స్ పై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతోందని, దాన్ని తాము కూడా అంగీకరిస్తున్నామని చెప్పారు. ఐ న్యూస్ పై వచ్చిన వార్తపై ఏమైనా అభ్యంతరం ఉంటే ఖండన ఇవ్వడం లేదా పరువు నష్టం కలిగిందని భావిస్తే.. న్యాయస్థానాల ద్వారా చూసుకోవాలన్నారు. అలా కాకుండా కేసులు పెట్టి అరెస్ట్ చేయడం తగదన్నారు. సీఎం చంద్రబాబు, డీజీపీ వెంటనే స్పందించి అరెస్ట్ చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని, జర్నలిస్టుల పై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com